సాక్షి సూర్యాపేట

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



శివపార్వతుల కల్యాణం

యాదాద్రి క్షేత్రంలోని శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరాలయంలో స్వామివారి కల్యాణం జరిపించారు. -10లో



పురాతన ఆలయాలు..

సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామం ఎన్నో శివాలయాలకు వేదిక అయింది. - 10లో

గరిష్టం/కనిష్టం
34°/20°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి

మునగాల(కోదాడ): పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ జి.ఉషారాణి సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పరీక్షల సమయంలో ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతులు, తదితర అంశాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న వివిధ రకాల పరీక్షలు, తదితర అంశాల గురించి ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరిని అడిగి తెలుసుకున్నారు.

లైటింగ్ ప్రభలు ప్రారంభం

మేళ్లచెరువు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రభలను శుక్రవారం ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీపీ పద్మ సైదేశ్వరరావు, గోవింద రెడ్డి, వెంకటరెడ్డి తదితరులున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి లైటింగ్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట సర్పంచ్ శంకర్ రెడ్డి, వర్రా వెంకటరెడ్డి, ఇమ్రాన్, జనిగ సైదులు తదితరులు ఉన్నారు.

గోదావరి జలాల తగ్గింపు

అర్వపల్లి : జిల్లాకు గోదావరి జలాలను తగ్గించారు. 1700 క్యూసెక్కుల గోదావరి జలాలు వస్తుండగా వాటిని 690 క్యూసెక్కులకు తగ్గించారు. ఇందులో 69 డీబీఎంకు 200, 71 డీబీఎంకు 490 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ శుక్రవారం తెలిపారు. మొదటి దశ నుంచి నీటిని తగ్గించడంతో జిల్లాకు నీటిని తగ్గించామని పేర్కొన్నారు. మరో నాలుగైదు రోజుల్లో నీటిని పెంచే అవకాశం ఉందని తెలిపారు.

గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శిగా మధునాయక్



మధునాయక్

పాలకవీడు : గిరిజన శక్తి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పాలకవీడు మండలంలోని కల్మేట్‌తండా గ్రామానికి చెందిన కేశావత్ మధునాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర శరత్ నాయక్ నియామక పత్రం అందజేసినట్లు మధునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులకు చేస్తున్న సేవకు గుర్తుగా జిల్లా కార్యవర్గం నుంచి రాష్ట్రస్థాయి కార్యవర్గంలో చోటు లభించిందని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్త్ర నామార్చన, కుంకుమార్చన, ఎదుర్కోళ్ల మహోత్సవం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



ఆలయ తిరు వీధుల్లో అండాళ్ అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి తిరు, మాఢవీధి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సేవోత్సవం చేపట్టారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవ నిర్వహించారు. అలాగే శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆచార్యులు విశేష పూజలు చేపట్టారు.

● శివరాత్రి వెలుగులు



మహాశివరాత్రి పురస్కరించుకుని సూర్యాపేటలోని పిల్లలమర్రి గ్రామంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఎరుకేశ్వరాలయం

ఆయిల్ పామ్ సాగు పెంచాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు పెంపుపై ఉద్యాన, వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆయిల్ పామ్, వరి పంట సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ల వారీగా ఉద్యాన, వ్యవసాయ పంట సాగు వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,500ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,452 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగులో ఉందని, మిగతా 1,048 ఎకరాల్లో రైతులను గుర్తించి పంట సాగు కల్పించి లక్ష్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. 2023–24లో 10 వేల ఎకరాల లక్ష్యానికి అనుకూలంగా ప్రణాళికలు సిద్ధం చేసి రైతు వేదికల ద్వారా రైతులకు ఆయిల్ పామ్ పంటల సాగు, ప్రభుత్వ సబ్సిడీపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఏఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్ గౌడ్, వ్యవసాయ అధికారులు సంధ్యారాణి, వాసు, జగ్గూ నాయక్, ఉద్యాన అధికారులు జగన్, అనిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి సమర్థంగా నిర్వహించాలి

గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని11 మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రెటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మాణం పూర్తికాని వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యార్డుల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్, డీపీఓ యాదయ్య, డీఎఫ్ఓ సతీష్ పాల్గొన్నారు.

ఉపాధిలో ఏడో స్థానం

- 1,59,313 కుటుంబాలకు ఉపాధి హామీ పని కల్పించిన అధికార యంత్రాంగం
- 72.70 లక్షల పనిదినాలకు 60.98 లక్షల పనిదినాలు పూర్తి
- జాబ్ కార్డులు సద్వినియోగం చేసుకుంటున్న కూలీలు
- మరో 45 రోజుల్లో లక్ష్యం పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్న అధికారులు



నడిగూడెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పనులు జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగి వరి నాట్ల అనంతరం పల్లెల్లో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో కూలీలు ఉపాధి హామీ పనుల వైపు పరుగులు తీస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1,59,313 కుటుంబాలకు అధికార యంత్రాంగం పని కల్పించింది. 72.70 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 60.98 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే 7వ స్థానంలో నిలిచింది.

72.70 లక్షల పనిదినాలే లక్ష్యంగా..

సూర్యాపేట జిల్లాలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా పరిధిలో 475 గ్రామ పంచాయతీల వారీగా పనులను గుర్తించిన యంత్రాంగం.. పనుల వేగవంతానికి చర్యలు చేపట్టింది. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలో 2022–23 సీజన్‌కు 72.70 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటికే 60.98 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. ఇప్పటి వరకు 83.89 శాతం పని దినాలు కల్పించగా మరో 45 రోజుల్లో లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

2,94,878 మంది కూలీలకు పని

జిల్లాలోని 23 మండలాల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు 2,61,479 ఉండగా, 5,78,477 మంది కూలీలు ఉన్నారు. 2022- 23 సీజన్‌లో 1,59,616 కుటుంబాల్లో 2,94,878 మంది కూలీలకు పనికల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.106.21 కోట్లు ఉపాధి హామీలో ఖర్చు చేయగా రూ.88.36 కోట్లు కూలీలకు వేతనంగా చెల్లించారు. 533 కుటుంబాలు ఇప్పటివరకు 100 శాతం పనిదినాలు పూర్తి చేసుకున్నారు.

> **జాబ్‌కార్డు ఉన్నవారికి పని కల్పిస్తాం**
>
> జిల్లావ్యాప్తంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లాలో ఇప్పటివరకు 60.98 లక్షల పనిదినాలు పూర్తిచేసి రూ.88.36 కోట్లను ఉపాధి కూలీలకు చెల్లించాం. మార్చి చివరి నాటికి లక్ష్యం పూర్తి చేస్తాం.
>
> – కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ

దేశ ప్రజలకు సేవ చేయాలన్నదే కేసీఆర్ ఆకాంక్ష



క్యాంప్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ తదితరులు

- సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : దేశ ప్రజలకు సేవ చేయాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ 70వ జన్మదినోత్సవ వేడుకలను సూర్యాపేట పట్టణంలోని క్యాంప్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం 70కేజీల భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అధునాతన వసతులతో కూడిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా వికలాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ తరహా అభివృద్ధి కోసం దేశ ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ నుంచి పుట్టిందే బీఆర్ఎస్ అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు వైవి, గండూరి ప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు జీడి భిక్షం, నెమ్మాది భిక్షం, ఉప్పల ఆనంద్, బైరు వెంకన్నగౌడ్, ఆకుల లవకుశ, కక్కిరేణి నాగయ్యగౌడ్, అయూబ్‌ఖాన్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు




కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి ఉద్యోగులకు పంచారు. వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, వికలాంగులకు ట్రై సైకిల్స్‌తో పాటు మూడు చక్రాల మోపెడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, అదనపు కలెక్టర్ మోహన్ రావు, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, జెడ్పీసీఈఓ సురేష్, డీఎఫ్ఓ సతీష్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జ్యోతి పద్మ, శిరీష, శ్రీదేవి, నాగభూషణం, యాదయ్య జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు ‘లెర్నింగ్ యాప్’

- ‘తొలిమెట్టు’ పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్ తీసుకువచ్చిన విద్యాశాఖ
- విద్యార్థుల సామర్థ్యాలను ఇందులో నిక్షిప్తం చేస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల ప్రగతి, విద్యా ప్రమాణాలు తెలుసుకునే అవకాశం



సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కనీస సామర్థ్య స్థాయిని పెంపొందించేలా విద్యాశాఖ ఆగస్టు నుంచి ప్రతిష్టాత్మకంగా తొలమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల ప్రగతి ఎలా నమోదైందో పరిశీలించేందుకు విద్యాశాఖ ఇటీవల స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఇందులో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానంతో విద్యార్థుల ప్రగతి, విద్యా ప్రమాణాలు తెలుసుకునే అవకాశం ఉంది.

తనిఖీ నామమాత్రంగా నిర్వహించకుండా ఉండేందుకు..

జిల్లాలో 698 ప్రభుత్వ ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 32,017 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం, తప్పనిసరిగా వచ్చేలా చేయడానికి ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రాథమిక పాఠశాలలోని పిల్లలందరికీ 1 నుంచి 5వ తరగతి వరకు మౌలిక భాషా, గణిత సామర్థ్యాల సాధన కోసం ఈ కార్యక్రమం అమలవుతోంది. డీఈఓ, సెక్టోరియల్ అధికారులు, మండల నోడల్ అధికారులు, ఎంఈఓలు క్షేత్ర స్థాయిలో పాఠశాలలను సందర్శిస్తున్నారు. వీరికి జిల్లా స్థాయి డీఆర్పీ, ఎమ్మార్పీలు సహకారం అందిస్తున్నారు. తనిఖీ నామమాత్రంగా నిర్వహించకుండా పారదర్శకత పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తున్నారు.

అభ్యసన సామర్థ్యాలు యాప్‌లో నమోదు

పాఠశాలల్లో తనిఖీకి వెళ్లిన సముదాయ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ అనుసంధానం ఉండటంతో అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షణకు వెళ్తున్నారు. బేస్‌లైన్ టెస్ట్ ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి, ప్రగతి పాఠశాలలో ఎలా నమోదు చేశారనే దానిపై మరోసారి ఈ యాప్ ద్వారా మానిటరింగ్ బృందం పరిశీలిస్తోంది. విద్యార్థుల ప్రగతి ఎంత వరకు వాస్తవమో తెలుసుకుంటున్నారు. తరగతిలో ఒకరిద్దరిని పరీక్షిస్తున్నారు. దీంతో విద్యార్థి వాస్తవ సామర్థ్యాలు నమోదవుతున్నాయి. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వారంలో ఐదు రోజుల పాటు బోధన, ఒక రోజు మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా చివరి వారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి లోపాలను సవరిస్తున్నారు.

> **విద్యార్థి ప్రగతి తెలుసుకోవచ్చు**
>
> విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తొలిమెట్టు కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతుంది. పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ ముమ్మరంగా చేస్తున్నాం. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పర్యవేక్షించుకోవచ్చు. దీంతో ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.
>
> – డీఎస్ జనార్దన్, సెక్టోరియల్ అధికారి

మార్కెట్ యార్డుకు మూడు రోజులు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న శివరాత్రి, 19న ఆదివారం, 20న అమావాస్య సందర్భంగా మూడు రోజుల పాటు మార్కెట్ యార్డుకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. రైతులు తిరిగి ఈ నెల 21న క్రయ విక్రయాలు జరుగుతాయని తెలిపారు.

వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత

- బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించిన కేంద్రం
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణ పరిమితి పెరిగే అవకాశం



హుజూర్‌నగర్‌లో వీధి వ్యాపారుల కోసం నిర్మించిన దుకాణ సముదాయం

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లోని వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా పట్టణాల్లోని రహదారుల వెంట వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఆర్థికంగా మరింత చేయూతనిచ్చేందుకు కేంద్రం ఇటీవల బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారికి ఇచ్చే రుణ పరిమితి మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అర్హులకు గుర్తింపు కార్డులు..

రెండేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విజృంభణ నేపథ్యంలో లాక్‌డౌన్ విధించడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డవారు ఎక్కువగా వీధివ్యాపారులే. ఈ తరుణంలో వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. పీఎం స్వనిధి (ఆత్మనిర్భర్) పథకాన్ని ప్రారంభించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి, గుర్తింపు కార్డులు జారీ చేసింది. రెండేళ్ల కాలంలో వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ఆర్థికంగా భరోసా కల్పించింది.

రుణం చెల్లించిన వారికి తిరిగి మరింత సాయం..

ఎవరి ప్రమేయం లేకుండా వీధుల వెంబడి కూర్చుని వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు ఆత్మనిర్భర్ పథకం ద్వారా తొలివిడతలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. రుణం చెల్లించిన వారికి రెండో విడత రూ.20 వేలు అందించారు. సక్రమంగా కిస్తీలు కట్టిన వారికి మూడో విడతలో రూ.50 వేలు అందించారు. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్రం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించడంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీధి వ్యాపారులకు ఇచ్చే రుణం రూ.లక్ష వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా దుకాణాలు..

వీధి వ్యాపారుల కోసం ఆయా మున్సిపాలిటీల వారు దుకాణాలను నిర్మించారు. సూర్యాపేటలో 27, కోదాడలో 9 దుకాణాలు నిర్మించి వాటిని వీధి వ్యాపారులకు అందించారు. అదే విధంగా హుజూర్‌నగర్‌లో 14 దుకాణాలను నిర్మించారు. వాటిని వీధి వ్యాపారులకు అందజేయాల్సి ఉంది. మిగతా చోట్ల నిర్మించలేదు.

> **రూ.లక్ష రుణ మంజూరుకు నివేదిక రూపొందిస్తున్నాం**
>
> 
>
> మొదటి విడత రుణాలు తీసుకుని చెల్లించిన వారికి రెండో, మూడో విడత రుణాలు పంపిణీ చేయడం జరుగుతుంది. నాలుగో విడతగా రూ.లక్ష వరకు మంజూరు చేసేందుకు నివేదిక తయారు చేస్తున్నాం. వ్యాపార లావాదేవీల్లో ఫోన్ పే, గూగుల్ పే, తదితర డిజిటల్ పేమెంట్ చేసే వారిని మరింత ప్రోత్సహించేందుకు నెలానెలా రాయితీ అందిస్తున్నాం.
>
> – రమేష్ నాయక్, పీడీ మెప్మా, సూర్యాపేట

11,667 మంది వీధి వ్యాపారులు

సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ ఐదు మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 11,667 మంది అర్హులైన వీధి వ్యాపారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారంతా తొలి విడత రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 9,517 మందికి రుణం మంజూరు కాగా 9,462 మందికి రుణ పంపిణీ జరిగింది. వీరిలో సక్రమంగా కిస్తీలు చెల్లించి 4,488 మంది రెండో విడత రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 3,929 మందికి రుణం మంజూరు కాగా 2,917 మందికి రుణ పంపిణీ జరిగింది. మూడవ విడత రుణం పొందేందుకు 44 మంది అర్హులుండగా వారిలో 42 మందికి రుణాలు మంజూరయ్యాయి. వారిలో 36 మందికి రుణాలు పంపిణీ చేయగా 8 మందికి చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా నాల్గవ విడతలో అర్హులైన వారికి రూ.లక్ష వరకు రుణం అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు నిర్ణయం సరికాదు



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

మునగాల(కోదాడ) : రైతాంగం వ్యవసాయ బావులు, బోరు మోటార్లకు వినియోగించే ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని, దీనిని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు వీరబోయిన వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, త్రీఫేజ్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో? తెలియని పరిస్థితి నెలకొన్నదని, దీంతో రైతులు బోర్లు, బావుల వద్దకు రాత్రివేళల్లో మళ్లీ పొలాల బాట పట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, షేక్ సైదా, విజయలక్ష్మి, స్టాలిన్‌రెడ్డి, ఉపేందర్, నాగయ్య, గోపయ్య, పిచ్చయ్య, వెంకటరెడ్డి, గుర్వయ్య పాల్గొన్నారు.

ఇసుక క్వారీ అనుమతి రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న పేరబోయినగూడెం వాసులు

నాగారం : పేరబోయినగూడెంలోని బిక్కేరు వాగులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఇసుక క్వారీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఇసుక క్వారీకి అడ్డగూడూరు మండలంలో అనుమతులు పొంది నాగారం మండలంలోని పేరబోయినగూడెం, వర్ధమానుకోట గ్రామ శివారుల్లో అనుమతులు లేకున్నా ఇసుక రవాణా చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా నడుస్తున్న ఇసుక క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పేరబోయిన పెద్ద ఉప్పలయ్య, పేరబోయిన అవిలయ్య, కంచుగట్ల లింగయ్య, దొడ్డి ప్రమీల, దాసరి సుగుణమ్మ, పేరబోయిన అనిల్, మల్లేష్, కడారి మహేందర్, సుకుమార్, షరీఫ్, ప్రభుదాస్, వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ పైనుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

గుండాల : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రామారం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుద్దాల గ్రామ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పని చేస్తున్న బాలరాజు విధులు ముగించుకొని సాయంత్రం బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామారం గ్రామ శివారులో బైక్‌పై నుంచి జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో నార్కట్‌పల్లి కామి నేని ఆస్పత్రికి తరలించారు.

ఎడమ కాల్వలో బాలుడు గల్లంతు

నిడమనూరు: ఎడమ కాల్వలో ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన నిడమనూరు మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని బొక్కమంతులపాడ్‌కు చెందిన చింతమల్ల భాస్కర్, జ్యోతి దంపతులకు అశోక్, ఆనంద్‌కుమార్ ఇద్దరు కవల పిల్లలు. అశోక్ నిడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం చింతమళ్ల అశోక్ స్నేహితులు, బంధువులతో కలిసి గ్రామ సమీపానే ఉన్న సాగర్ ఎడమకాల్వకు ఈతకు వెళ్లాడు. అశోక్ కాల్వ ఒడ్డున మెట్లపై స్నానం చేస్తూ కాలు జారి పడి పోయాడు. అక్కడే ఉన్న వారు వెంటనే పట్టుకోవాలని చూసినా అశోక్ వారికి కనబడకుండా నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బాలుడు అశోక్ తండ్రి చింతమళ్ల భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

పథకాలను అర్హులకు అందించాలి

భువనగిరిటౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో 3వ (వ్యవసాయం) స్థాయీ సంఘం సమావేశంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్‌లు ప్రజల వద్ద అదనంగా రూ. 50 చొప్పు వసూలు చేస్తున్నారన్నారు. అదే విధంగా పలు హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారని, క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డీసీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. రైతులకు ఎరువులు విత్తనాలు, క్రిమి సంహారక మందుల ఎమ్మార్పీ రేటుకు అందించే విధంగా చూడాలని డీఏఓను ఆదేశించారు. రబీలో దాదాపు 5లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గోపీకృష్ణ వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు 6వ(సాంఘిక సంక్షేమ) సాయి సంఘం సమావేశం యాదగిరిగుట్ట జెడ్పీటీసీ అనురాధ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

మిర్యాలగూడ అర్బన్ : ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది.ఈ ఘటన పట్టణంలోని హనుమాన్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌పేటలో గుడిసెలో నివాసముంటున్న మారయ్య శుక్రవారం ఎవరూ లేని సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో వస్తువులకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. సుమారు నాలుగు లక్షల విలువైన సామగ్రితో పాటు సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే పూరిగుడిసె దగ్ధమైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 284 కిలోల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 284 కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం పెరియార్ నగర్ శక్తి ఇల్లామ్ గ్రామానికి చెందిన శక్తి తనిగైరాజు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కరోనా సమయంలో వ్యాపారం దెబ్బతినగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయిని విక్రయిస్తున్నాడు.

ఏపీ పోలీసుల నుంచి తప్పించుకుని..

శక్తితనిగైరాజు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి సమీపంలోని నర్సీపట్నానికి చెందిన వీరబాబు, కృష్ణల వద్ద రెండు కిలోల తూకం ఉన్న 142 గంజాయి ప్యాకెట్లను తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. వాటిని కారులో తమిళనాడుకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బోలపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏపీ పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. అక్కడినుంచి నాగార్జునసాగర్ వైపు వస్తున్నట్లు నల్లగొండ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెద్దవూర వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టగా శక్తితనిగైరాజు కారును వదిలి పారిపోయాడు. సమీపంలోని సబ్‌స్టేషన్ గోడ దూకేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని వివరించారు. ఎవరైన చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, పెద్దవూర సీఐ నాగరాజు, ఎస్సై పరమేష్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌బాబు, కానిస్టేబుల్ కిషన్, హోంగార్డు మట్టయ్యలను అభినందించారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, కారు

దేవలమ్మనాగారం శోకసంద్రం


అంత్యక్రియలను పురస్కరించుకొని మృతుల ఇండ్ల వద్ద గ్రామస్తులు


నివాళులర్పిస్తున్న చలమళ్ల కృష్ణారెడ్డి

- నలుగురు మహిళల మృతదేహాలకు ముగిసిన అంత్యక్రియలు

చౌటుప్పల్ : దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన మహిళలు వరకాంతం అనసూయ, డాకోజి నాగలక్ష్మి, దేవరపల్లి శిరీష, సిలివేరు ధనలక్ష్మిల మృతదేహాలకు శుక్రవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం వేర్వేరుగా అంత్యక్రియలు చేశారు. శవయాత్రలో ఆయా కుటుంబాల బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు జరగడంతో గ్రామంలో ప్రజలంతా దుఃఖంలో మునిగిపోయారు. అత్యంత చిన్న వయసు కలిగిన డాకోజి నాగలక్ష్మి ఇద్దరు కుమారులు, కుమార్తెతో పాటు దేవరపల్లి శిరీష కుమారులు తమ తల్లుల మృతదేహాలను చూసి గతల్లడిల్లారు. తెలిసీతెలియని వయసులో ఉన్న ఆ చిన్నారులను బుజ్జగించేందుకు ఆయా కుటుంబీకులు ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. ఆ దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమళ్ల కృష్ణారెడ్డి పరామర్శించారు.

తల్లిదండ్రులు మందలించారని ..

- పురుగుల మందు తాగిన బాలిక
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

యాదగిరిగుట్ట : తల్లిందండ్రులు మందలించారని మనస్తాపంతో పురుగుల మందు తాగిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లికి చెందిన బండి శ్రీహరికి 15 సంవత్సరాల కుమార్తె ఉంది. బాలిక పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మైనర్ ఇంట్లోనే గత నెల 19వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు బాలికను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. తండ్రి శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ సురేష్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ మొఘల్‌పురాకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అలీ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. అవసరాలు తీర్చుకునేందుకు చోరీలకు పాల్పడుతున్నాడు. హైదరాబాద్‌లోని భవానీనగర్, అబిడ్స్‌రోడ్, కాచిగూడ, నారయణగూడ, నార్సింగి, రాజేంద్ర నగర్, సైదాబాద్, హుమాయూన్ నగర్, నాంపల్లి, గచ్చిబౌలి, చిక్కడపల్లి జూబ్లిహిల్స్, రాయదుర్గం పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు చేసి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో నిజామాబాద్ పోలీసులు అరెస్టు చేయగా నార్సింగ్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఈ క్రమంలో గత నెల 30న జైలు నుంచి విడుదలయ్యాడు. గురువారం ఉదయం మిర్యాలగూడ పట్టణం శాంతినగర్‌కు చెందిన నీలమ్మ నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఆమె వెనుకనుంచి అనుసరించాడు. అనంతరం ఆమె మెడలోని 4తులాల గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరిగెత్తాడు. బాధితురాలు కేకలు స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


మృతురాలి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన వరకాంతం అనసూయ, డాకోజి నాగలక్ష్మి, సిలివేరు ధనలక్ష్మి, దేవరపల్లి శిరీష మృతదేహాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మృతులు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రకటించారు. పిల్లల విద్యాభ్యాసానికి అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, కొయ్యడ సైదులుగౌడ్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సుర్గు రాజమ్మ, సర్పంచ్ గుడ్డేటి యాదయ్య, నాయకులు కంది లక్ష్మారెడ్డి, వరకాంతం జంగారెడ్డి, వర్కాల మహేందర్, సుర్గు శ్రీను, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, చీరిక రంగారెడ్డి, బక్క శ్రీనాథ్, పెద్దిటి చంద్రారెడ్డి ఉన్నారు.

భువనగిరి ఖిలాపై విద్యార్థుల సందడి

భువనగిరి : భువనగిరి ఖిలాపై శుక్రవారం సందర్శకుల సందడి నెలకొంది. సిద్దిపేట జిల్లాలోని వేద పాఠశాలకు చెందిన 123, మేడ్చల్ జిల్లాకు చెందిన విద్యాజ్యోతి పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా భువనగిరి ఖిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఖిలాపై చారిత్రాత్మక కట్టడాలు, కోలనులు, కోటలను తిలకించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సంతోష్, శోభారాణి, మంగ అనిత, అనిల్, భాస్కర్, కృష్ణవేణి హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఉన్నారు.


భువనగిరి ఖిలాపై ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఖిలాను సందర్శించిన జర్మని దేశస్తులు

జర్మని దేశానికి చెందిన బ్లూ జాన్, ఎలిజిబెత్‌లు భువనగిరి ఖిలాను సందర్శించారు. భువనగిరి ఖిలాను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి గైడ్‌గా ఆవుల వినోద్ ఖిలా చరిత్ర వివరాలను తెలియజేశారు.


ఖిలాపై జర్మనీ దేశస్తులు

పేలుడు పదార్థాలు పట్టివేత

- ఇద్దరి అరెస్ట్.. 30డిటోనేటర్లు, 16 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


మాట్లాడుతున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : అక్రమంగా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తూ రాళ్లను ధ్వంసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలును వెల్లడించారు. నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వరికుప్పల నగేష్ బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 200లోని పల్ల వెంకటరమణరెడ్డి వెంచర్‌లో రాళ్లను తొలగించేందుకు ఇటీవల రూ. 20 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 6 వేలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 16న వెంచర్‌లో తన బంధువైన చౌటుప్పల్ మండలం కేసారం గ్రామానికి చెందిన ఆలకుంట్ల రమేష్‌తో కలిసి జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను తీసుకుని వెళ్లాడు. వెంచర్ సూపర్‌వైజర్ నేదునూరి కొండల్‌రెడ్డితో మాట్లాడి వెంచర్‌లో రాళ్లను తొలగిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారంతో బీబీనగర్, భువనగిరి ప్రత్యేక పోలీసులు కలిసి దాడి చేశారు. ఈ సమయంలో వారి నుంచి 30 డిటోనేటర్లు, 16 జిలెటిన్ స్టిక్స్, వైర్లు, కంపరేషర్ వాహనం స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, రూరల్ సీఐ వెంకటయ్య, బీబీనగర్ ఎస్సై సైదులు పాల్గొన్నారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం యువ టీం ఆధ్వర్యంలో పట్టణంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 165 పదోతరగతి విద్యార్థులు రూ. 35వేలు విలువ చేసే స్టడీ మెటరీయల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిర్దేశించుకున్న లక్ష్య సాధన కోసం విద్యార్థులు కృషి చేసి ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు అందజేస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థుల కోసం యువటీం చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు పాశం కృష్ణమూర్తి, శర్మ, యువ టీం సభ్యులు రావుల సుధాకర్, మంచి కంటి భానుచందర్, చిన్నగారి నితీష్, రాజు, సాయితేజ, చరణ్, మహేష్, సుగుణాకర్, మేఘనాథ్, అభినయ్, మనీష్ పాల్గొన్నారు.

నీలగిరిలో మెగా రక్తదానం


నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలు

నల్లగొండ టూ టౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా నల్లగొండ పట్టణంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సీఎం కేసీఆర్ 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70 ఏట అడుగు పెట్టిన సందర్భంగా ఉమ్మడి జిల్లా పార్టీ నాయకత్వం నేతృత్వంలో 700 మంది కార్యకర్తలతో రక్తదానం చేయించారు. నల్లగొండ, మిర్యాలగూడ ,నాగార్జునసాగర్, మునుగోడు, దేవరకొండ, నకిరేకల్, భువనగిరి, కోదాడ, సూర్యాపేట తదితర నియోజకవర్గం నుంచి యువత తరలివచ్చి రక్తదానం చేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు నల్లగొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నోముల భగత్ తదితరులు రక్తదానం చేశారు.

త్వరలో అండర్ పాస్ పనులు ప్రారంభం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


వంగపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్-వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో వంగపల్లి వద్ద అండర్ పాస్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో 5.52 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మరమ్మతు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. వంగపల్లి బైపాస్ నుంచి మొదలుకుని, పలు గ్రామాలను కలుపుకుని, మోటకొండూర్ మండలం మీదుగా, ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లి వరకు రోడ్డు పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్‌హెచ్163 జాతీయ రహదారిలో వంగపల్లి వద్ద, వంగపల్లి-మోటకొండూర్ వెళ్లే రహదారిలో అండర్ పాస్ నిర్మాణం కావాలని పలుమార్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రోడ్డు పనుల నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రులు ప్రశాంత్ రెడ్డి, జగదీశ్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.

ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన

వంగపల్లిలో గ్రామస్తుల అవసరాలకు పీఆర్ నిధులు రూ.కోటితో చేపడుతున్న ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

బీబీనగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. బీబీనగర్, మోటకొండూర్, జాజిరెడ్డిగూడెం, హుజూర్‌నగర్,భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన పెద్దరాముల భిక్షపతి(51) గురువారం మండల కేంద్రానికి బస్సులో వచ్చాడు. అనంతరం ఇందిరమ్మ కాలనీ వరకు వెళ్లడానికి వాహనాల సౌకర్యం లేకపోవడంలో రోడ్డుపై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఎక్కాడు. మార్గమధ్యలో బైక్ వేగంగా వెళ్లడంతో భిక్షపతి వెనుక నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో గాయపడ్డాడు. అతడిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రాఘవేంద్ర సూపర్ మార్కెట్ యజమాని ఉప్పాల శ్రీహరి (77) తన మోటార్ సైకిల్‌పై కోదాడ రోడ్ వైపు ఉన్న పీఎస్‌టీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతునన్నాడు. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్ నగర్ వైపు వస్తున్న లారీ శ్రీహరి స్కూటీని ఢీ కొట్టాడు. దీంతో శ్రీహరి తలకు, ఎడమ కాలుకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉప్పాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే పద్మావతి సంతాపం

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల శ్రీహరి రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరం అని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి సంతాపం తెలిపి, సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.


శ్రీహరి (ఫైల్)

ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శ్రీహరి కుటుంబాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి రజిత దంపతులు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీహరి రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తీవ్రంగా కలిచి వేసిందని వారు పేర్కొన్నారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ శివారులోని అనంతారం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి గుర్త తెలియని వ్యక్తి మద్యం మత్తులో అనంతారం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు మార్గం మధ్యలో కూర్చున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంధర్‌గౌడ్ తెలిపారు.


మోపెడ్ పైనుంచి కిందపడి..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం చాకలిగూడెం గ్రామానికి చెందిన అక్కెనపల్లి యాదగిరి(57), ఆయన కుమారుడు సత్యనారాయణలు ఇద్దరు శుక్రవారం గ్రామం నుంచి మోపెడ్‌పై సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో 365బీ హైవేపై తిమ్మాపురం శివారులో జమ్మన్లబోడు వద్ద సూర్యాపేట మండలం రాజనాయక్‌తండాకు చెందిన మోతీలాల్ ఒక్కసారిగా ఎదురురావడంతో ఆయనను తప్పించబోయి మోపెడ్ అదుపు తప్పి పడిపోవడంతో యాదగిరి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఈ మోపెడ్ నడుపుతున్న కుమారుడు సత్యనారాయణకు గాయాలయ్యాయి. అలాగే మోపెడ్‌కు ఎదురొచ్చిన మోతీలాల్ కూడా గాయపడ్డాడు. గాయపడిన వారిని 108అంబులెన్సులో సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా యాదగిరి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బావ బాసాని యాదగిరి ఫిర్యాదు మేరకు అర్వపల్లి ఏఎస్ఐ కె.కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనాస్థలిలో యాదగిరి మృతదేహం

బైక్ పైనుంచి కిందపడి..

మోటకొండూర్: తుర్కపల్లి మండలం దత్తపల్లి గ్రామానికి చెందిన కోట సంపత్‌కుమార్ (21) స్నేహితులైన కనకరాజు, బిల్ల బాలుతో కలిసి గురువారం రాత్రి బైక్‌పై ఆలేరు మండలంలోని గొలనుకొండలో డీజే ఆపరేటింగ్‌కు వెళ్లారు. కాగా పని పూర్తి కాగానే శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మోటకొండూర్ మండలంలోని మాటూర్ శివారు ప్రాంతంలోని కాటమయ్య టెంపుల్ వద్ద అదుపు తప్పి ద్విచక్రవాహనం గుంతలో పడింది. దీంతో కోట సంపత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. సంపత్ తండ్రి రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.


సంపత్(ఫైల్)